# తొలిసారి గుండె కవాటం మరమ్మతు

## చెన్నైలో అరుదైన శస్త్ర చికిత్స.. హిమోఫీలియా నుంచి విముక్తి

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): శరీరంలో అంతర్గత రక్తస్రావం కారణంగా వచ్చే హిమోఫీలియా వ్యాధికి గురైన 38 ఏళ్ల వ్యక్తికి చెన్నై మియాట్ ఇంటర్నేషనల్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రపంచంలోనే తొలిసారిగా గుండె కవాటానికి మరమ్మతు చేసినట్లు మియాట్ ఆసుపత్రి వైద్యులు శుక్రవారం ప్రకటించారు. గుండెలో రక్తప్రసరణను క్రమబద్ధీకరించే కవాటం దెబ్బతింటే అంతర్గత రక్తస్రావం జరుగుతుంది. ఇది శరీర అవయవాలు, కణజాలాల్ని నాశనం చేస్తూ.. ప్రాణాలను హరిస్తుంది. ఇప్పటి వరకు హిమోఫీలియా వ్యాధిగ్రస్తులకు కృత్రిమ కవాటాల మార్పిడి జరిగేదని.. దీని వల్ల జీవితకాల ఫలితాన్ని పొందలేమని వారన్నారు. డాక్టర్ వీవీ బాషి నేతృత్వంలో 20మంది వైద్యుల బృందం గత నెల 23వ తేదీన అత్యంత సంక్లిష్టమైన హృదయ, శ్వాసకోశ సంబంధ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. మెటల్ లేదా కృత్రిమ కవాటాలను ఉపయోగించకుండా, ఉన్న కవాటాన్నే మరమ్మతు చేయడం ఇదే తొలిసారని డాక్టర్ వీవీ బాషి చెప్పారు. ఈ శస్త్రచికిత్సలో ప్రత్యేక సాంకేతికతతో రూపొందించిన ద్రవ పదార్థాన్ని, వెలుపలికి విసర్జించలేని సింథిటిక్ వస్త్రాన్ని.. కవాటానికి జోడించారు. ఈ వస్త్రం సాయంతో రోగి వాల్వ్ తిరిగి పనిచేయడం ప్రారంభించిందని డాక్టర్ బాషి అన్నారు. దాదాపు 7 గంటలపాటు శస్త్రచికిత్స జరిగింది. ఆపరేషన్ పూర్తైన 3 గంటల తర్వాత కవాటం యథావిధిగా పనిచేస్తోంది.




పేషంట్ బినుతో మియాట్ నిర్వాహకులు, డాక్టర్ వీవీ బాషి

శస్త్రచికిత్స జరిగిన తర్వాత ఎలాంటి మందులు వాడాల్సిన అవసరం లేకపోవటం ఈ విధానం ప్రత్యేకత. కొద్దిరోజులు విశ్రాంతి తీసుకుంటే చాలు. కేరళకు చెందిన వ్యాపారి బిను నెట్టింకరన్ ఈ శస్త్రచికిత్స చేయించుకున్న తొలి వ్యక్తిగా నిలిచారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగా ఉన్నారని, కొద్దిరోజుల్లో సాధారణ జీవితాన్ని గడపవచ్చని డాక్టర్ బాషి చెప్పారు. భారత హిమోఫీలియా ఫెడరేషన్ ఉపాధ్యక్షురాలు చెన్నైకి చెందిన ఉషా పార్థసారథి.. అమెరికాలో ఉన్న ఎల్‌పే కమ్యూనికేషన్స్ సంస్థ ప్రాజెక్టు షేర్ కింద ఈ శస్త్రచికిత్సకు రూ.10లక్షల సహాయం అందించారు. హిమోఫిలియా వ్యాధితో బాధపడే వారికి ప్రాజెక్టు షేర్ కింద రోగి పరిస్థితిని బట్టి ఉచితంగా మందులు సరఫరా చేస్తామని ఉష తెలిపారు.